


# నిరుద్యోగులకు గిరీశంగారి సలహా

కర్లపాలెం కృష్ణరావు గారు

నవంబరు నెల "వినోదిని" లో "గిరీశంగారి బహుమానము" చూచిన తర్వాత, చాలామంది మిత్రులు "అప్పుడప్పుడు గిరీశంగారిని ఆంధ్రలోకానికి చూపించరాదు టండీ?" అని నన్ను కోరినారు. "మీరందరు చూడాలంటే రాకపోతాడా?" అన్నాను.—ఆంధ్రులకు గిరీశంమీద మహాశ్రద్ధ. కారణ మేమిటంటే? అప్పారావుగారు గిరీశాన్ని ఆంధ్రుల చేతుల్లో బెట్టి "జాగ్రత్తగా కాపాడుకోనండి" అని చెప్పారు.

అప్పటినుండే అంటే—"కన్యా శుల్కము" లో మనము చూచినప్పటినుండి, గిరీశం హాయిగా బుచ్చమ్మతో కాలక్షేపము చేస్తున్నాడు. వెంకటేశాన్ని చదువు సంధ్యల వ్యవహార మెట్లా వున్నను లంకాకు చుట్టలు చుట్టి పెట్టడములో మాత్రము ప్రవీణ్ణి జేశాడు గిరీశము. ఈ ముగ్గురు ఏకకుటుంబీకులుగా నుండి అప్పటినుంచి యిప్పటివరకు యెన్ని అవాంతరాలు వచ్చినా సమర్థించుకొంటూ కాలప్రవాహానికి యెదురీదుతున్నారు. నిరుద్యోగపు డిపార్టుమెంటు పుట్టిన నాటినుండి గిరీశం ఆ డిపార్టుమెంటునే నమ్ముకొని పడియున్నాడు. ఈ డిపార్టుమెంటులో తదాది కొంతమంది ప్రవేశించి కొన్నాళ్లుండి మరొకలైను తొక్కడము మామూలు అయిపోయింది గాని, గిరీశంమాత్రం వదలకుండా సర్వీస్ ననుసరించి పెత్తనదారు అయినాడు. ఇతడనేక రకాల వ్యాపారాలు జేసేవాడు. నల్లులమందు—తేళ్లమందు—వశీకరణ లేహ్యము—వల్లకాటి లేహ్యము—ఇత్యాదులు—ఒకటేమిటి? ఎన్నిరకాల వ్యాపారాలో సాగించి డబ్బు సంపాదించి తాను తిని, ఒకరికి పెట్టాడు. కొన్నాళ్లు పరీక్షకు పొయ్యే విద్యార్థులకు, ఉద్యోగాలు కావలసిన యువకులకు, బిరుదులు కావలసిన పెద్ద మనుష్యులకు తాయిత్తులు కట్టి రొక్కము గణించాడు.

ఒకనాడు శయన మందిరములో గిరీశం బుచ్చమ్మతో సరస సల్లాపా లాడుతుండగా బుచ్చమ్మ "పంతులుగారూ! తాము యీ విధంగా దొంగ తాయిత్తులు కట్టి ప్రజలను మోసగించి ధన మార్జించుట మంచిపనా?" అని అడిగింది. అంతట గిరీశం యీ లెక్చరు కొట్టాడు.

"డామిట్! మోసమేమిటి? ఇలాంటి మాటలు మాట్లాడితే నీవు నాగరక ప్రపంచానికి పనికిరావు. కాబట్టి నిన్ను వదిలి వేయవలసి వస్తుంది సుమా! తెలిసిందా? మై డియర్ బుచ్చమ్మా! ఇలా చూడు—మోసమంటా వేమిటి? ప్రపంచకమంతా మోసంగాదూ? ఇలాంటి పనులు పెద్దవాళ్లు జేస్తే, వ్యాపారమని, వ్యవహారమని అంటారు—చిన్నవాళ్లు జేస్తే మోసమని దొంగతనమని అంటారు. పెద్ద, చిన్న, అనే భేదముతో అందరు దొంగలే. ఇటు

చూడు.—పిల్లలకు పరీక్ష పేపర్లు అమ్ముకొనే మేష్టర్లది మోసం గాదూ? లోకంలో వున్న అబద్ధాలన్నీ చెప్పి దొంగ సలహా లిచ్చి ఫీజు గుంజే ప్లీడర్లది మోసం గాదూ? సప్తాహాలు చేయిస్తాననిన్నీ గుళ్లు కట్టిస్తాననిన్నీ చెప్పి చందాలు వసూలుచేసి, దిగమ్రింగే పెద్ద మనుష్యులది మోసంగాదూ? గ్రంథకర్తలయొద్ద కమీషను పుచ్చుకొను చున్న కొందఱి హెడ్ మాష్టర్లది మోసం గాదూ? ఇన్నెందుకు? లంచాలు లేకుండా యే పని జరుగుతున్నది? ఈ లంచగొండితనము దేశమంతటా, అంటు వ్యాధివలె వ్యాపించి పోయింది. తండ్రి కొడుకుల మధ్య -భార్యా భర్తల మధ్య—భక్తుడికి దేవుడికి మధ్య—యీ లంచమే ప్రత్యక్షమై మారు పేర్లతో చలామణి అగుచున్నది. కొబట్టి ఈ మాట లిక చాలించు—ఏ వ్యవహారమైనా కొంచెం లౌక్యంగా ప్రవర్తిస్తే యే చిక్కు రాదు......ఏమి టలా నవ్వుతావు? ఆఁ! నీవు నవ్వితే, అదో విధంగా, అమాయికత్వం......ఇలారా, మరి......ఒక్కటి.

బుచ్చి:—చాలేగుదూ? వేళా పాళా లేదు. బ్రాహ్మణీకమంతా పాడుజేసి...

గిరీ:—మనం పాడుజేసే దేమిటి? బ్రాహ్మలే పాడుజేసుకొన్నారు బ్రాహ్మణీకాన్ని...ఇదుగో! నీవుమాత్రం సరిగా జరిపి యేడ్చావు? రమ్మనమని పిలవంగానే, లేచి నావెంట బడి వచ్చావుగదా?

బుచ్చి:—ఔను, నాదే తప్పు. మీ మాటలు నమ్మి, మోసపోయినాను.

గిరీ:—అదుగో! మళ్లీ మోసమంటా వేమిటి?...సరే, అయిందేమో అయిందిగాని, యిప్పుడు లేచిపోతావా ...ఆఁ! ఆఁ! నన్ను తాకకూడదు. దూరంగా వుండాలి.

బుచ్చి:—అబ్బ! ఎన్ని నేర్చారండి?

గిరీ:—ఎన్ని నేర్వందే, ఈ ఆడదయ్యా లున్న ప్రపంచకంలో బ్రతుక గలుగుతాను?...ఇప్పు డింకో తమాషా చేయబోతున్నాను చూడు.

బుచ్చి:—చెప్పండి వింటాను.

గిరీ:—అలా చెప్పను. చేసినతర్వాత చూచి, మెచ్చుకోవలసిందే.



బుచ్చి:—సరే, లేవండి ఇక్కడినుంచి—ఈమాటలతో అయ్యే దేమిటి?

ఇలా నాలుగురోజులు గడిచినయి. గిరీశం బుద్ధిగలవాడని తలచి, తమ కేదైనా మార్గం చూపుతాడని, పని పాటలు లేని గ్రాడ్యుయేట్లు, కొందరు వచ్చి, గిరీశాన్ని ఆశ్రయించారు. బుచ్చమ్మగూడా “పాపం! వాళ్లకేదైనా జీవనోపాధి గలిగించండి. మీ పేరు చెప్పుకొని బ్రతుకుతారు” అని శిఫార్సు చేసింది. గిరీశం వాళ్లందరికి ధైర్యము చెప్పి పంపివేశాడు.

గిరీశం మరునటిదినం అన్ని వార్తా పత్రికలకు జాబులు వ్రాశాడు. తెల్లవారేటప్పటికి అన్ని వార్తా పత్రికలలోను.

“నిరుద్యోగులకు మాత్రము, ధనము సంపాదించుకొనుటకు, సులభమైన మార్గము చూపబడును. ప్రతి దరఖాస్తుదారు, తాను నిరుద్యోగి యని తెలియ జేయు స్వంత పత్రమున్ను, రెండు అణాల తపాలాబిళ్లన్ను,

దరఖాస్తు వెంట బంపుకొన వలెను. ధృవ పత్రములు లేని దరఖాస్తులు అంగీకరింప బడవు" ఇట్లు—గిరీశం——.

అని పెద్ద పెద్ద యక్షరములతో ప్రకటింప బడినది. ప్రకటనానంతరము ఒక వారము రోజులలోగా, 950 దరఖాస్తులు గిరీశంగారికి చేరినయి. అతడు మహదానందంతో బుచ్చమ్మను బిల్చి, "మాచావా! అయాస పడకుండా, రెండు నెల్ల గ్రాసం సంపాదించుకొన్నాను" అన్నాడు.

"ఇన్ని దరఖాస్తులు యెలా వచ్చినయండీ?"

"ఊరికొక వెర్రివాడుంటే చాలదూ?"

"పంతులు గారూ! ఈ అన్యాయార్జితం..."

"చిత్తం! బుచ్చమ్మ గారూ! ఇలాంటి తెలివి తక్కువ మాటలు చాలించి, తమరు వంటయింట్లోకి దయచేయండి" అని గిరీశం పరిహాసంగా అన్నాడు.

తరువాత వార్తా పత్రికలలో

"ధనము సంపాదించుటకు ఇలాంటివే సులభోపాయాలు"——


అని గిరీశం ప్రకటించాడు. ఇది చూచి దరఖాస్తుదారులు నాలుకలు కొరుకొన్నారు.

ఆయుర్వేద విద్వాన్ బి. వి. పండిట్ గారి

నమ్మకమైన బలవర్ధకౌషధములు

ప్రఖ్యాతి గాంచిన తైలములు

శిశువులకు ప్రసిద్ధమైన మందులు



(రిజిస్టరుడు ట్రేడ్ మార్కు)

శ్రీకర కస్తూరి మాత్రలు:—జ్వరములను కుదుర్చును. ఆకలిని పుట్టించును. ప్రసవకాలమున నుపయోగింప దగినది. సీసా 0-4-0

గోరోజన మాత్రలు:—జ్వరములు, బాలపాపచిన్నెలను కుదుర్చును. పడిశము నివారించును. కొద్దిగ విరేచనకారి. 25 మాత్రల సీసా 0-6-0

బాలసంజీవిని:—భేదిమందు. 50 మాత్రల సీసా 0-4-0

కర్పూరాదివటి:—భేదుల నాపుదలజేయును. 50 మాత్రల సీసా 0-4-0

ఐ. డి. యల్. చ్యవనప్రాశము:—బలహీనులై శుష్కించిన శిశువులకు. 6 తులములు 0-8-0

యూనికన్ (టానిక్) 2 ఔన్సుల సీసా 8 అణాలు. 36 తులములు 2-4-0

మా డిపోను మీయూరిలో నుంచగోరుమని మాకు వ్రాయుడు.

జీవసుధ  మహాసౌభాగ్యమంతి

సోల్ ఏజంట్లు: యునైటెడ్ కన్సరన్, 54, బందరు వీధి, మద్రాసు. (బెజవాడ: యజ్ఞయ్య గారి మేడ)